జరుగుతాయి. గిరిజనాభివృద్ధిసంస్థలో పనులు చేయించుకోవడానికి ప్రతి గ్రామంలో గ్రామ గిరిజనాభివృద్ధి సంస్థలున్నాయి(వి.టి.డి.ఎ). చదువుకున్న యానాదులు చైతన్యవంతులై ఈ వివరాలు తెలుసుకొని యానాదులకోసం జీవితాన్ని అంకితంచేసిన శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారి స్ఫూర్తితో అటు ప్రభుత్వం- ఇటు తమ సమాజంలో అభివృద్ధికోసం కృషిచేయాలి. చట్టాలు, సాంఘిక భద్రతలకు పథకాల అమలు, వారి సమాజంలోమార్పు ఈ సమన్వయం సాధించుకోవడం యానాదుల మనుగడకు అత్యవసరం.

**కోటులురానీ - కోటులుపోనీ మాటను తప్పదు మా కులము**

**ఏటివెల్లువల కెన్నిటికైనను - చేటును చెందదు మా గృహము**

**అందగరానటువంటి సుఖంబుల కర్రులు చాచదు - మా కులము**

**పొందగరానటువంటి ఫలంబుకు - పొక్కదు, సొక్కదు మా కులము**

ఇటువంటి దరిద్రనారాయణుల సేవకోసం మళ్ళీమళ్ళీ జన్మిస్తాననీ స్వామి వివేకానంద మనకు బోధించారు. స్వామీజీ 150వ జన్మదినోత్సవాలను దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న సందర్భంలో యానాదుల సాంస్కృతిక వారసత్వంలోని విశిష్టతను కాపాడుతూ యానాదుల అభివృద్ధికి తోడ్పాటునందించటానికి అందరం సంసిద్ధం కావాలి.

**20 అక్టోబరు, ఆదివారం ఉ॥10.00గం॥ల నుండి సా॥5.00గం॥ల వరకు నెల్లూరులోని కస్తూరిదేవి బాలికా పాఠశాల, ఆడిటోరియం, దుర్గామిట్టలో** జరుగు **యానాది యువజన సమ్మేళనంలో** పాల్గొందాం.

**స్వామివివేకానంద 150వ జయంతి ఉత్సవసమితి**
**ఆహ్వాన సమితి**
**శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా**






# ‘ఆకలి దప్పలకు అలమటించేదే ఆదికులం యానాదికులం’



సముద్రం కయ్యలలో- చెరువుల ఒడ్డున చిన్న చేపలను పట్టుకుంటూ, అటవీ ఫలసాయం పోగుచేసుకుంటూ - తప్పనిసరి అయినపుడు మాత్రమే కూలికి పోయే స్వేచ్ఛాజీవులు యానాదులు. తిరుపతివెంకన్న వారి ఇష్టదైవం. పెంచలకోన నరసింహుడు వారి అల్లుడు. బోనుపల్లిగ్రామంలో తమ గూడెంకు వచ్చిన అల్లుడిని వారు ఉత్సవాలతో మర్యాద చేస్తారు. సుబ్బారాయుడిని (నాగసర్పము) కొలవని యానాది ఉండదు. యానాది భాగవతాలు గ్రామప్రాంతాలలో ప్రసిద్ధి. యానాదుల దాంపత్యం - తగవులు తీర్చుకునే విధానాలు ప్రత్యేకమైనవి. అత్యంత ప్రాచీనమైన గిరిజన తెగకు చెందినవారు యానాదులు. అచ్చ తెలుగు మాట్లాడే యానాదులది - పస్తుకు, పండుగకు అంత బేధములేని జీవితం, యాచించే స్వభావంలేదు, మొగమాటం వారి ప్రవృత్తి, తిడితే నవ్వడం, కొడితే ఊరుకోవడం, కోపంలేకపోవడం, ‘నా’ అనే దృష్టి లేకపోవడం, నిర్మలమైన మనస్సు- యానాదుల సహజ స్వభావాలు

భర్త కలుగులు తవ్వుతున్నప్పుడు భార్య పక్కన చేరి ఉసిగొల్పుతుంది. భర్తవడ్లు దంచుతుంటే భార్య చేటతో చెరుగుతుంది. పెనిమిటి గుంటలో చేపలు పడుతుంటే గట్టున కూర్చున భార్య ఆ చేపలను ఏరి తాటాకుల సంచిలో వేస్తుంది. మగడు సోదె చెప్పుతుంటే స్త్రీ బల కొడుతుంది. ప్రక్కగ్రామానికి ప్రయాణమైపోయినా ఆలుమగలు కలిసి ఒరుసుకుంటూ నడువవలసినదే.

దసరా పండుగల్లో యానాదుల ఆనందానికి అడ్డూ ఆపు ఉండదు. మగవారు స్త్రీల వేషాలలో, కృష్ణుడు, గోపిక వలె శ్రీరాముడు సీతమ్మవలె పౌరాణిక పాత్రలను ధరించి, కొయ్య గుఱ్ఱాలలో దూరి ఆడుతూ చుట్టూ ఉన్న గ్రామస్థులను ఆనందంలో ముంచుతూ తేలుస్తుంటారు.

**యానాదుల వృత్తి నైపుణ్యం :**

నలభై, యాభై అడుగుల పొడవైన ఎలుక కలుగుల తవ్వకము, విషసర్పాలను పట్టుకొని కర్రగాయాలు ఏర్పడకుండ విక్రయయోగ్యంగా ఉండేటట్లు తోలు తీయడము, బొక్కల్లో ఉండి కరచుకొని ఉన్న ఉడుముల జాడదీసి మోకాళ్ళబిర్రుతో వెలుపలకు లాగడము, మైకాగనుల సొరంగాలలో బొక్కలు కొట్టి డైనమైట్ తునకలను అందులో బిగించి బండలను పగులగొట్టుటకై వత్తులను వెలిగించి అవి పేలే లోపలే సురక్షితమైన కనుమపక్కలకు నిచ్చెనలపై, గనులవెలుపలికి చావుపరుగుతో పరుగెత్తడము, శిఖరాగ్రమునుండి వందలకొలది అడుగుల దిగువకు మోకాలు మీద మెలకువగా దిగి తేనె పెరలను కింద రాలిపోకుండ కుడిచేతితో చెక్కి ఎడమ చేతిలోని పంజులతో తేనె టీగలను తోలి పెళ్ళలు దిగువ పడకుండ బుట్టలోకి పట్టుకొని పైకి మోకు బరువుమీదనే ఎక్కిపోవడము - యానాదులుచేసే ఇటువంటి పనులు వేరే వారి తరంకావు. ఇప్పటికీ అరచేతి తోలు వూడిపోయేటట్లు జీడిమామిడి పప్పును పగులగొట్టేది, ఐదారు కి.మీ. దూరాన్నుండి కట్టెలమోపు తెచ్చేది చల్లయానాదులే.

**ఇప్పటికీ వెనుకబడ్డ యానాదులు :**

అడవులలో గిరిజనులు, సముద్రంలో మత్స్యకారులు - బీడుభూములలో పశువుల కాపరులుగా, విశాలభూభాగంలో ఆహారం సేకరించుకునే ఈ జాతులు, తెగలను ఇళ్ళకాలనీలో ఒక చోట స్థిరపరచి అభివృద్ధిచేయాలని ప్రభుత్వాలు పథకాలను అమలుపరచసాగాయి. ఈ పథకాలు వారికి తగినవికాక, సరిగా తగినంతకాలం అమలు చేయకపోవడంవల్ల-ఈ లోగా సహజవనరులు నశించడం, ఇతరులహస్తగతం కావడంవల్ల వారి జీవితం దుర్భరం కాసాగింది. కాలనీలు వదిలి మళ్ళీ వారు చెరువుగట్టుమీద గుడిసెలు వేసుకోవడం-పొలాలు ఆక్రమణలకు గురై, వ్యవసాయం చేయలేక వెట్టిచాకిరికి మళ్ళడం వారికి తప్పడం లేదు. చిన్నచేపలు పట్టుకోవడానికికూడా ఒకరి దయాధర్మంమీద వారు ఆధారపడవలసి వస్తున్నది.

గత సంవత్సరం డిసెంబరునెలలో నెల్లూరుజిల్లా గూడూరు మండలంలో ఒక యానాది బాలకార్మికుని బలవన్మరణం హృదయాన్ని కలచివేస్తుంది. అతని తల్లితండ్రులు ఇరవైవేల రూ॥లు అప్పు తీసుకున్నారు. ఆ పసివాడిని రెండువేల రూ॥లకు తల్లిదండ్రులు దాభా యజమానికి తాకట్టుపెట్టారు.



దేశమంతా పొదుపుసంఘాలు బలోపేతమౌతున్న దశలో యానాదులలో ఆ సంఘాలు అంతగా లేకపోవడం-చిన్న చిన్న అప్పులకోసం వారు వెట్టిచాకిరికీ తలవంచడం, ఉపాధి హామీపనులు తగినంత లేకపోవడం-అందరికీ రేషన్‌కార్డులు లేకపోవడం, పెన్షన్లు లభించకపోవడం - ఇలా సాంఘిక, ఆహార భద్రతా పథకాలు సరిగా అమలు కాకపోవడంవల్ల యానాదిజీవితం నేటికీ దుర్భరంగానే ఉంది. యానాదులందరిలోకి చల్ల యానాదులు మరీ వెనుకబడి ఉన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు విఫలం కావడంతో ఈ జాతుల సంప్రదాయ వనరులమీద హక్కులు కల్పించడమే తగిన మార్గంగా ప్రభుత్వాలు చట్టాలు చేయసాగాయి. ఇపుడు అమలవుతున్న అటవీ హక్కుల గుర్తింపు చట్టం, త్వరలో రానున్న తీరప్రాంతపు మత్స్యకారుల హక్కుల గుర్తింపుచట్టం ఇటువంటివి. సాంఘిక భద్రతా పథకాల అమలుతోపాటు ఈ చట్టాల అమలుకోసం గట్టిగా కృషిచేయాలి. ఔషధీ మొక్కలను గుర్తించడంలో యానాదులు నిపుణులు. ఆ నైపుణ్యాన్ని జీవ వైవిధ్యచట్టం క్రింద గుర్తించి వారి అభివృద్ధికి కృషిచేయాలి. చెన్నైలో పాముల విషంతీయడంలో "ఇరుల" తెగవారికి శిక్షణ ఇస్తున్నారు. ఇప్పుడు చిన్నచేపలపెంపకంమీద ప్రభుత్వం శ్రద్ధ పెరిగింది. ఈత తెలియనందున వలలు లేనందున సముద్రంలోకి చేపలకోసం యానాదులు పోరు.

**చేపట్టాల్సిన పనులు :**

అడవి యానాదులు, పాకియానాదులు, చల్లయానాదులుగా నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలొ 3722 గ్రామాలలో 166 మండలాలలో గల వీరి జనాభా 4,62,167 వీరికోసం యానాది గిరిజనాభివృద్ధి సంస్థ ఏర్పాటైంది. రెండు దశాబ్దాల ముందే ఏర్పడిన చెంచు గిరిజనాభివృద్ధి సంస్థ తరహాలో ఈ సంస్థను తీర్చిదిద్దవలసి ఉన్నది. చెంచు సంస్థకు గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ అధ్యక్షుడు, 14 మంది చెంచులు ఈ సంస్థ పాలకవర్గంలో సభ్యులు. ఆరునెలలకు ఒకసారి ఈ పాలకవర్గం సమావేశాలు జరుగుతాయి. ఉపాధిహామీ, పొదుపు పథకాలు ఈ సంస్థద్వారానే అమలు